## క్లుప్తంగా

### నేడు ఉపాధి హామీ ప్రజావేదిక

పొన్నూరు: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 2023–24 సంవత్సరంలో మండలంలోని 29 గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనులపై సామాజిక తనిఖీ బృందాలు చేసిన విచారణపై బహిరంగ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి.చంద్రశేఖరరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే ప్రజాభిప్రాయ సేకరణలో గ్రామస్థాయి అధికారులు, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొనాలని తెలిపారు.

### ధర్మశాసన విధివిధాన పత్రిక మంజూరు



పొన్నూరు: పట్టణంలోని అవ్వారు బురయ్య ధర్మసత్రం అనువంశిక ధర్మకర్త అవ్వారు వెంకట సాంబశివరావు చేసుకున్న విన్నపానికి దేవదాయ శాఖ అధికారులు స్పందించారు. అనారోగ్యం కారణంగా ధర్మసత్రం అనువంశిక ధర్మకర్తగా తాను కొనసాగలేనని, తన స్థానంలో వేరొకరు హక్కులు పొందేందుకు అవసరమైన ధర్మశాసన విధి విధాన పత్రిక కోసం ఇటీవల కలెక్టర్ గ్రీవెన్స్‌లో సాంబశివరావు అర్జీ దాఖలు చేశారు. స్పందించిన ఎండోమెంట్ అధికారులు ధర్మశాసన విధి విధాన పత్రికను సాంబశివరావుకు మంజూరు చేశారు. మంగళవారం పొన్నూరులోని ఆయన నివాసంలో దేవదాయ శాఖ కార్యనిర్వహణాధికారి భవాని ప్రసాద్ పత్రికను అందజేశారు.

### అవినీతి నిరోధక విభాగం ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా వేణుగోపాల్



గుంటూరు రూరల్: రాష్ట్ర అవినీతి నిరోధక విభాగం స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా గుంటూరు నగరానికి చెందిన అన్నంగి వేణుగోపాల్‌ను నియమిస్తూ నియామక ఉత్తర్వులను సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మదిరే రంగసాయిరెడ్డి జారీచేశారు. తిరుపతిలో జరిగిన ప్రజా సంకల్ప వేదిక నూతన కమిటీని రాష్ట్ర అధ్యక్షులు, ప్రముఖ హైకోర్టు న్యాయవాది మదిరే రంగసాయి రెడ్డి అధ్యక్షతన ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అవినీతి నిరోధక విభాగానికి గుంటూరుకు చెందిన అన్నంగి వేణుగోపాల్‌ను నియమిస్తూ నియామక పత్రాలను అందచేశారు.

### రెండు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'



పొన్నూరు: మండలంలోని కొండమూడి, వడ్డిముక్కల గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి రబీ సాగులో ఉన్న మినుము, పెసర ప్రధాన పంటలను వ్యవసాయాధికారులు పరిశీలించారు. ఏఓ డేగల వెంకట్రామయ్య మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణంలో మినుము, పెసర పంటలలో బూడిద తెగులు ఉధృతి పెరిగే అవకాశం ఉందన్నారు. దీని నివారణకు మైక్‌లో బుటానిల్ 10 శాతం డబ్ల్యూపీ (ఇండెక్స్) అనే తెగులు మందును 100 నుంచి 120 గ్రాములు ఒక ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది ప్రియాంక, వర్షా, సురేష్ బాబు, రైతులు పాల్గొన్నారు.

### హెల్మెట్ ధారణపై వినూత్న ప్రచారం




ప్రత్తిపాడు: హెల్మెట్ వినియోగంపై ప్రత్తిపాడు పోలీసులు వినూత్నంగా అవగాహన కల్పిస్తున్నారు. గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో ప్రత్తిపాడు ఎస్ఐ కె.నాగేంద్ర ద్విచక్ర వాహనదారులు, ప్రజలకు హెల్మెట్ ఆవశ్యతకను వివరిస్తున్నారు. అదేవిధంగా గుంటూరు పర్చూరు పాత మద్రాసు రోడ్డుతో పాటు 16వ నంబరు జాతీయ రహదారిపై బ్లాక్ స్పాట్స్, డేంజర్ స్పాట్‌లలో వినూత్నమైన అవగాహన పోస్టర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అందులో 'తల మీదే రక్షణ మీదే.. ఒక తల పోతే రెండో తల పొందలేరు నాలాగా' అంటూ వినాయకుడి ఫొటోతో పోలీసులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ వాహన చోదకులను ఆలోచింపజేస్తుంది.

### త్యాగరాజ ఆరాధన ఉత్సవం

నగరంపాలెం: స్థానిక బ్రాడీపేట 2/14వ అడ్డ రోడ్డులోని నాగార్జున సాంస్కృతిక కేంద్రం, సంగీత కళాశాలలో మంగళవారం త్యాగరాజ ఆరాధన ఉత్సవాన్ని నిర్వహించారు. సంగీత త్రయం శ్యామశాస్త్రి, త్యాగ రాజస్వామి, ముత్తుస్వామి దీక్షితార్‌ల విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ సంగీత కళాశాల అధ్యాపకులు నందకుమార్, నాగార్జున సంగీత కళాశాల, సాంస్కృతిక కేంద్రం ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.సూర్యనారాయణ పాల్గొన్నారు.

# కాంప్లెక్స్‌కు బైబై.. క్లస్టర్‌కు జై!

- స్కూల్ కాంప్లెక్స్‌లు క్లోజ్
- పాఠశాలల్లో అమల్లోకి 'క్లస్టర్' విధానం
- క్లస్టర్ హెచ్ఎంలపై అదనపు పనిభారం
- పరీక్షల వేళ ఉపాధ్యాయులకు తిరుగుడు తిప్పలు
- సీఆర్పీలకు మంగళం!
- ఎంఈఓల అధికారాలకు కోత..?
- కూటమి ప్రభుత్వం నిర్ణయంపై పెదవి విరుస్తున్న ఉపాధ్యాయులు



ప్రత్తిపాడులోని క్లస్టర్ హైస్కూల్

ప్రత్తిపాడు: కూటమి ప్రభుత్వం కాంప్లెక్స్‌లకు మంగళం పాడేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో బోధనాంశాలపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చే పాఠశాల సముదాయాల స్థానంలో (కాంప్లెక్స్), క్లస్టర్ విధానాన్ని అమలోకి తీసుకువచ్చింది. దీంతో నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, వట్టిచెరుకూరు మండలాల్లో ఉన్న 16 స్కూల్ కాంప్లెక్స్‌ల స్థానంలో 8 క్లస్టర్లను ఏర్పాటు చేశారు. ఈ ప్రభావం అటు క్లస్టర్ హెచ్ఎంలు, ప్రైమరీ హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, ఎంఈఓలు, సీఆర్పీలపై పడనుంది.

**హెచ్ఎంలపై అదనపు పనిభారం..**

కొత్త విధానంలో క్లస్టర్ స్కూల్ హెచ్ఎంలపై అదనపు పనిభారం పడుతుంది. ఇప్పటివరకు పాఠశాలల్లో ఎలాంటి పరీక్షలు నిర్వహించాలన్నా సంబంధిత ప్రశ్నాపత్రాలు ఎమ్మార్సీకి వచ్చేవి. అక్కడి నుంచి సీఆర్పీల సహకారంతో ఎంఈఓలు పేపర్లను హెచ్ఎంలకు అందించేవారు. కానీ ఇకపై ఆ బాధ్యత క్లస్టర్ స్కూల్ హెచ్ఎంలపై పడనుంది.

**పరీక్షల వేళ ప్రైమరీ హెచ్ఎంలకు చుక్కలు..**

ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో ఫాంప్–3 పరీక్షలు జరుగుతున్నాయి. గతంలో ప్రశ్నాపత్రాలను ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు సమీపంలోని స్కూల్ కాంప్లెక్స్‌లకు వెళ్లి ఉదయం, మధ్యాహ్నం విడివిడిగా పేపర్లు తెచ్చుకునేవారు. ఇప్పుడు పాఠశాలలున్న గ్రామాలకు, క్లస్టర్ స్కూల్‌కు మధ్య దూరం అధికంగా ఉండటంతో ప్రైమరీ స్కూల్స్ హెచ్ఎంలు దూరంలో ఉన్న క్లస్టర్ స్కూళ్లకు రెండు పూటలా వెళ్లి నీర్ణత సమయంలోగా పేపర్లు తెచ్చుకోవాల్సి వస్తుంది.

**ఎంఈఓల అధికారాలకు చెక్!**

కూటమి సర్కార్ తెచ్చిన కొత్త విధానం వలన ఎంఈఓల అధికారాలకు కూడా కోత పడనుందన్న ప్రచారం ఉపాధ్యాయ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. ఇప్పటివరకు మండలంలో విద్యాశాఖకు సంబంధించి డీడీఓ అధికారాలు ఎంఈఓలకు ఉన్నాయి. వీరు నెల నెలా ఉపాధ్యాయుల జీత భత్యాలు బిల్లులు, ఎస్ఆర్ నిర్వహణ వంటివి చేస్తున్నారు. ఇకపై ఈ విధానానికి స్వస్తి పలికి త్వరలో క్లస్టర్ స్కూల్ హెచ్ఎంకు జీతాల పంపిణీ అధికారం బదలాయింపు చేయనున్నారన్న వార్తలు వినవస్తున్నాయి.

**సీఆర్పీల భవిష్యత్ ప్రశ్నార్థకం..**

కాంప్లెక్స్ స్థానంలో క్లస్టర్‌లు తీసుకురావడంతో సీఆర్పీ (క్లస్టర్ రిసోర్స్ పర్సన్)ల భవిష్యత్‌పై నీలినీడలు కమ్ముకున్నాయి. ఇప్పటివరకు ఒక్కో కాంప్లెక్స్‌కు ఒక్కో సీఆర్పీ చొప్పున నియోజకవర్గంలో 15 మంది ఎన్నోఏళ్లుగా పనిచేస్తున్నారు. ఇప్పుడు క్లస్టర్ విధానం అమల్లోకి రావడంతో వీరి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. సీఆర్పీలకు బీఈడీ అర్హత ఉండడంతో గత ప్రభుత్వం క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్లుగా గుర్తింపునిచ్చి, మండలంలో బోధనకు సైతం వీరి సేవలు ఉపయోగించుకుంది. ఇప్పుడు క్లస్టర్ విధానం అమలుతో వీరి పరిస్థితి ఏమటన్నది తెలియాల్సి ఉంది.

**స్కూల్ కాంప్లెక్స్‌లు, క్లస్టర్ల లెక్క ఇలా..**

- ప్రత్తిపాడు మండలంలో నాలుగు స్కూల్ కాంప్లెక్స్‌లను రెండు క్లస్టర్‌లుగా మార్చారు. ఒక క్లస్టర్‌లో 22, మరో క్లస్టర్‌లో 22 పాఠశాలలు ఉన్నాయి.
- వట్టిచెరుకూరు మండలంలో నాలుగు కాంప్లెక్స్‌లను రెండు క్లస్టర్‌లు చేసి, ఒక క్లస్టర్‌లో 19, రెండవ క్లస్టర్‌లో 23 పాఠశాలలను చేర్చారు.
- కాకుమాను మండలంలో నాలుగు కాంప్లెక్స్‌లను రెండు క్లస్టర్‌లు చేసి ఒక క్లస్టర్‌కు 25, మరో క్లస్టర్‌కు 20 పాఠశాలలు చేర్చారు.
- పెదనందిపాడు మండలంలో నాలుగు కాంప్లెక్స్‌లను రెండు క్లస్టర్‌లు చేసి ఒక క్లస్టర్‌లో 19, రెండవ క్లస్టర్‌లో 17 పాఠశాలలు చేర్చారు.

### బాలల హక్కులు కాపాడాలి

వంగిపురం హైస్కూల్ హెచ్ఎం వి.నాగేశ్వరరావు



అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులు, చిన్నారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న హెచ్ఎంలు

ప్రత్తిపాడు: బాలల హక్కులు కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని వంగిపురం హైస్కూల్ హెచ్ఎం వి.నాగేశ్వరరావు అన్నారు. బేటీ బచావో, బేటీ పఢావో కార్యక్రమంలో భాగంగా మంగళవారం వంగిపురం అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలల హక్కులపై అవగాహన కల్పించారు. చిన్నారులు, విద్యార్థులు, గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా హెచ్ఎం నాగేశ్వరరావు మాట్లాడుతూ తల్లిదండ్రులు ఆడపిల్లలపై వివక్ష చూపకుండా ఉన్నత చదువులు చదివించాలన్నారు. చదువు మధ్యలో మాన్పించి బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. అమ్మాయిలు కేవలం కుమార్తెలు మాత్రమే కాదని, రేపటికి రూపశిల్పులని వివరించారు. హెచ్ఈ స్కూల్ హెచ్ఎం వి.మరియరాజు, మహిళా పోలీస్ అనూష, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం.సరస్వతి, కె.వెంకటేశ్వరమ్మ, తల్లులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బాధితులకు వైఎస్సార్ సీపీ నేతల ఆర్థికసాయం



బాధితులతో మాట్లాడుతున్న నల్లమోతు శివరామకృష్ణ

చినలింగాయపాలెం(కాకుమాను): మండలంలోని చినలింగాయపాలెంలో గత రెండు రోజుల క్రితం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో తమ గృహాలతో పాటు సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు మంగళవారం వైఎస్సార్ సీపీ నాయకులు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈసందర్భంగా వ్యవసాయ సలహామండలి జిల్లా మాజీ చైర్మన్ నల్లమోతు శివరామకృష్ణ మాట్లాడుతూ ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ కుమార్ ఆదేశాల మేరకు బాధిత కుటుంబాలకు రూ.20వేలు ఆర్థిక సహాయాన్ని అందించినట్లు ఆయన తెలిపారు. ప్రమాదంలో సర్వం కోల్పోయిన కుటుంబాలకు పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని ఆయన తెలిపారు. ప్రభుత్వం నుంచి రావల్సిన పథకాలను త్వరితగతిన వచ్చే విధంగా పోరాడుతామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు మెట్టు వెంకటప్పారెడ్డి, కవిత, తదితరులు ఉన్నారు.

## రక్తదానం ప్రాణదానంతో సమానం

విజ్ఞాన్ యూనివర్సిటీ వీసీ పి.నాగభూషణ్



రక్తదానం చేస్తున్న విద్యార్థులతో వీసీ పి.నాగభూషణ్, ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసబాబు

చేబ్రోలు: రక్తదానం ప్రాణదానంతో సమానమని, విద్యార్థులందరూ రక్తదానానికి పూనుకోవాలని విజ్ఞాన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్ పిలుపునిచ్చారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో మంగళవారం విద్యార్థులు రక్తదానం చేశారు. యూనివర్సిటీలోని ఎన్ఎస్ఎస్ విభాగం, గుంటూరు జీజీహెచ్, నీడ్స్ బ్లడ్ బ్యాంక్‌ల సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ప్రతి రెండు సెకన్లకు ఎక్కడో ఓ చోట ఎవరో ఒకరికి రక్తం అవసరం అవుతూనే ఉందని తెలిపారు. రక్తదానం చేశాక శరీరం తాను కోల్పోయిన రక్తాన్ని 48 గంటల్లోగా భర్తీ చేసుకుంటుందని వెల్లడించారు. రక్తాన్ని కృత్రిమంగా తయారుచేయలేమని, ఎవరైనా దానం చేస్తేనే లభిస్తుందని వెల్లడించారు. ప్రమాదాల సమయంలో బాధితులకు రక్తం అవసరం ఎంతో ఉంటుందని చెప్పారు. రక్తదానం వల్ల నేడు ఎంతోమందిని వైద్యులు బతికించగలుగుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా 552 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. వారికి సర్టిఫికెట్లను అందజేశారు. రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసబాబు, డీన్లు, అధిపతులు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

## కౌలు రైతుల రక్షణ, సంక్షేమానికి చట్టం తేవాలి



మట్లాడుతున్న కౌలురైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య

పెదకాకాని: కౌలు రైతుల రక్షణ, సంక్షేమం కోసం తక్షణమే సమగ్రమైన కౌలుచట్టం తీసుకురావాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెదకాకాని ఏఐటీయూసీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో జమలయ్య మాట్లాడారు. ఎన్నికల ముందు కౌలురైతులను ఆదుకునేందుకు సమగ్రమైన నూతన కౌలురైతు చట్టాన్ని తీసుకొచ్చి అన్ని రకాలుగా ఆదుకుంటామని వాగ్దానం చేసిన రాష్ట్ర ప్రభుత్వం ఆచరణలో విఫలమైందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు పెట్టుబడి సాయం పథకం కింద ప్రతి కుటుంబానికి రూ.20 వేలు ఇస్తామని వాగ్దానం చేయడంతో పాటు కౌలు రైతులను ఆదుకుంటామని, కౌలు రైతుల చట్టం తీసుకొస్తున్నామని రాష్ట్ర వ్యాప్తంగా సభలు పెట్టి హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. ఎనిమిది నెలలు పూర్తి అవుతున్నా కౌలురైతు చట్టం గురించి ప్రస్తావించకపోవడం, పెట్టుబడి సాయం అందించకపోవడం కౌలు రైతులను మోసగించడమేనన్నారు. కౌలు రైతులకు చట్టం లేకపోవడం వల్ల గుర్తింపు కార్డులు పొందలేక పోతున్నారన్నారు. పండించిన పంటలను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవడానికి అవకాశం లేకుండా పోయి నష్టపోతున్నారన్నారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఇప్పటి వరకు 280 మంది రైతాంగం ఆత్మహత్య చేసుకుంటే ఇందులో 90 శాతం కౌలు రైతులే ఉన్నారన్నారు. అనంతపురం, కర్నూలు గుంటూరు జిల్లాల్లో ఈ ఆత్మహత్యలు చేసుకున్నవారు ఉన్నారని, ఒక్క కుటుంబానికి కూడా ఇంతవరకు నష్టపరిహారం చెల్లించలేదన్నారు. కౌలు రైతుల సమస్యల పరిష్కారం కొరకు ఫిబ్రవరి 2న గుంటూరులోని కొత్తపేటలోగల మల్లయ్య లింగం భవన్‌లో సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు కొల్లి రంగారెడ్డి, కౌలు రైతుల సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు కంజుల విశల్ రెడ్డి, ఏఐటీయూసీ జిల్లా నాయకుడు పుప్పాల సత్యనారాయణ పాల్గొన్నారు.

### సురక్షిత తాగునీరు అందించాలి



కాకుమాను: వేసవి సమీపిస్తున్న దృష్ట్యా మండల ప్రజలకు ప్రతి రోజు సురక్షితమైన తాగునీరు అందించాలని ఎంపీడీఓ లక్ష్మీదేవి అన్నారు. పెదనందిపాడు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం వాటర్ ఎయిర్ ఇండియా ఆధ్వర్యంలో మండలంలోని సర్పంచులు, కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లతో రానున్న రోజుల్లో తాగునీటి సమస్య అధిగమించడంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ రానున్న వేసవిలో మండల ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా కార్యదర్శులు ఆయా గ్రామాలలోని చెరువులను పూర్తిస్థాయిలో నింపుకోవాలని సూచించారు. ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించే విధంగా కార్యదర్శులు పని చేయాలని ఆమె ఆదేశించారు. ఈసందర్భంగా వాటర్ ఎయిర్ ఇండియా ఆధ్వర్యంలో కిట్‌లను పంపిణీ చేశారు.

### బ్యాంకు రుణాలపై రైతు అవగాహన సదస్సు



గుంటూరు రూరల్: వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట నందున్న రైతునేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం వ్యవసాయశాఖ, రైతు నేస్తం ఫౌండేషన్ రైతులకు బ్యాంకులనుంచి రుణాలు ఏవిధంగా పొందాలి అవగాహన సదస్సు నిర్వహించారు. కౌలు రైతులకు బ్యాంకుల్లో రుణాలు ఏవిధంగా పొందాలి ఏఏ పత్రాలను సమర్పించాలి తదితర విషయాలను జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ మహిపాల్‌రెడ్డి వివరించారు. వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, ఏఓ లక్ష్మి, రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు, యూనియన్ బ్యాంకు మేనేజర్ ఫణీంద్ర పాల్గొన్నారు.

### లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం

నగరంపాలెం: లింగ నిర్ధారణ చేయడం చట్టపరంగా నేరమని జిల్లా న్యాయ సేవాధికారసంస్థ కార్యదర్శి టి.లీలావతి అన్నారు. జీజీహెచ్ ఆవరణలోని నర్సింగ్ కళాశాలలో మంగళవారం పి.సి, పి.ఎన్.డి.టి చట్టంపై న్యాయ విజ్ఞాన అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా లీలావతి మాట్లాడుతూ ఎవరైనా స్కానింగ్‌లో లింగ నిర్ధారణ చేయమని అడిగితే చేయవద్దని అన్నారు. ఆడ పిల్లలైతే గర్భంలోనే హత్య చేస్తున్నారని పేర్కొన్నారు. సమాజంలో ఆడ, మగ పిల్లలను పోల్చి చూడటం ఎక్కువైందన్నారు. తద్వారా ఆడ పిల్లలను తక్కువగా చూడటం వల్ల పి.సి, పి.ఎన్.డి.టి చట్టం 1994లో అమల్లోకి వచ్చిందని విద్యార్థినులకు వివరించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చట్టపరంగా శిక్షార్హులవుతారన్నారు. ప్యానెల్ అడ్వకేట్ కట్ట కాళిదాసు, కళాశాల ప్రిన్సిపాల్ సుజాత రాణి పాల్గొన్నారు.

## విద్యార్థి దశనుంచే దేశభక్తి అవసరం

భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా సెక్రటరీ ఎం.ఏడుకొండలు




విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న జిల్లా సెక్రటరీ ఏడుకొండలు, హెచ్ఎం శ్రీనివాస్

ప్రత్తిపాడు: విద్యార్థులు విద్యార్థి దశ నుంచే దేశభక్తి అలవర్చుకోవాలని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా సెక్రటరీ ఎం.ఏడుకొండలు అన్నారు. పీఎంశ్రీకు ఎంపికైన ప్రత్తిపాడు భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం హెచ్ఎం హెచ్. శ్రీనివాస్ ఆధ్వర్యంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ నూతన టీంను ఏర్పాటు చేశారు. హాజరైన ఏడుకొండలు విద్యార్థులకు యూనిఫామ్, బెల్టులు, క్యాప్, షూలు అందించారు. అనంతరం వారితో స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఏడుకొండలు మాట్లాడుతూ భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో విద్యార్థులు చేరడం వలన వారిలో సేవాభావం, క్రమశిక్షణ, దేశభక్తి అలవరతాయన్నారు. హెచ్ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ 26 మంది ఆరు, ఏడు తరగతుల విద్యార్థులతో టీం ఏర్పాటు చేశామని చెప్పారు. స్కౌట్స్, గైడ్స్ టీచర్లు ఆర్.వి. హెచ్.ఎల్ రాజు, టి.మాలతి పాల్గొన్నారు.

## భారతీయ ఆధ్యాత్మిక విధానం ప్రపంచానికే ఆదర్శం



కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు



అనుగ్రహ భాషణ చేస్తున్న శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ

అవధూత, దత్త పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ

గుంటూరు రూరల్: భారతీయ ఆధ్యాత్మిక, శాస్త్రీయ జీవన విధానం గొప్పదనం ప్రపంచ దేశాలు ఏనాడో గుర్తించాయని సద్గురువులను ఆశ్రయించడం, వారి బోధనల మార్గంలో నడవడం ద్వారా జీవన్ముక్తులుగా మారవచ్చని అవధూత, దత్త పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ పేర్కొన్నారు. 'దత్త క్షేత్ర నాదయాత్ర 2025'లో భాగంగా మంగళవారం చౌడవరం గ్రామంలోగల దత్తనాథ క్షేత్రంలో సచ్చిదానంద స్వామీజీ, అవధూత దత్తపీఠ ఉత్తరాధిపతి శ్రీశ్రీ దత్త విజయానంద తీర్థ స్వామీజీలచే భక్తజనుల భక్తి ప్రపత్తుల నడుమ ఉదయం నిత్య పూజలు, గోపూజ, శ్రీ చక్రార్చన, హోమం నిర్వహించారు. అనంతరం నాదబ్రహ్మ శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీచే ఆంజనేయ రాగసాగర 'నాద ధ్యాన చికిత్స కచేరీ' నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామీజీ అనుగ్రహ భాషణం చేస్తూ మనిషి ఆధ్యాత్మికంగా ఎదగాలంటే సద్గురు బోధనల మీద నమ్మకం ఉంచి నడవడం, క్రియా యోగం నిత్యం సాధన చేయాలన్నారు. సంగీత సాధన ద్వారా శారీరక, మానసిక రుగ్మతలు దూరమవుతాయన్న విషయాన్ని భారతీయులు ఎప్పుడో రుజువు చేశారన్నారు. భారతీయుల సంగీతనాద చికిత్స శాస్త్రం శాస్త్ర బద్ధమైనదేనని ప్రపంచ దేశాలు నేటికి గుర్తించాయని వివరించారు. భక్తులకు తీర్థ ప్రసాద, అన్నప్రసాద వితరణ గావించారు. ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ గోపికష్ణ, ట్రస్టీలు బి.సీతారామిరెడ్డి, డాక్టర్ వెంకటరత్నం, మిట్టపల్లి రాజేంద్ర బాబు, వెంకటేశ్వర రెడ్డి, వీడీ గాంధీ తదితరులు పాల్గొన్నారు.

## కుష్టురహిత దేశమే లక్ష్యం కావాలి



పెదకాకాని పీహెచ్‌సీని సందర్శించిన సెంట్రల్ టీం సభ్యులు

పెదకాకాని: భవిష్యత్‌లో భారతదేశం కుష్ఠువ్యాధి రహిత దేశం కావాలని ఎల్‌సీడీసీ సెంట్రల్ లెప్రసీ నోడల్ అధికారి డాక్టర్ రంగనాథ్ అన్నారు. పెదకాకాని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో ఈనెల 20వ తేదీ నుంచి ఫిబ్రవరి 2 వరకు లెప్రసీ సర్వే చేపట్టారు. ఈ సర్వేలో భాగంగా ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు ఇంటింటికీ తిరిగి సర్వే చేపట్టారు. కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించి వారిని వైద్యాధికారి వద్దకు తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించడం, మందులు వాడి నయడం చేయడం సర్వే ముఖ్య ఉద్దేశ్యం. ఈ సర్వే నిర్వహణ పరిశీలనకు మంగళవారం ఢిల్లీ నుంచి సెంట్రల్ లెప్రసీ బృందం పెదకాకాని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించింది. క్షేత్రస్థాయిలో సర్వే, రికార్డు రిజిస్టర్లను పరిశీలించి పలు సలహాలు సూచనలు ఇచ్చారు. కేంద్ర బృందంలో జాతీయ లెప్రసీ ఎరాడికేషన్ ప్రోగ్రాం కన్సల్టెంట్ డాక్టర్ అక్షిత్ పురోహిత్, రాష్ట్ర బృందంలో సత్యవతి, జావిద్, ఉపేంద్ర, జిల్లా అధికారులు జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ శ్రీనివాసులు, న్యూక్లియర్ వైద్యాధికారి డాక్టర్ లక్ష్మనాయక్, డీపీఎంఓ జె.బసవయ్య, డాక్టర్ జె.సింధూర, పుసులూరి శ్రీనివాస్, మురళీకృష్ణ పాల్గొన్నారు.



జాతీయ రహదారిపై దట్టంగా కురుస్తున్న పొగమంచు




పెదకాకాని రైల్వేహాల్ట్ సమీపంలో లైట్లతో వస్తున్న రైలు



మంచుతో సాలె గూడు అందాల అల్లిక

## మంచు రోజులు

మండలంలో రోజు రోజుకూ పొగ మంచు తీవ్రమవుతుంది. గత వారం రోజులుగా ఉదయం 9 గంటల వరకు జాతీయ రహదారిపై రాకపోకలు సాగించే వాహనాలు లైట్లు వేసుకునే ప్రయాణాలు సాగిస్తున్నాయి. దగ్గరలో ఉన్న వాహనాలు కూడా కనిపించని స్థాయిలో పొగమంచు దట్టంగా కురుస్తోంది. మంచుతో తడిసిన సాలె గూళ్ల ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

– పెదకాకాని